జీఎన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ట సంతోషదాయకం

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కుప్పం: పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం: కుప్పంలో సంఘ సంస్కర్త జీఎన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ట సంతోషదాయకమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కుప్పం వైఎస్ జీఎమ్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్థల దాత జీఎన్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎన్ రెడ్డి కుప్పంలో 40 ఏళ్లు చేసినా సామాజిక సేవలు హర్షణీయమన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. తరువాత వికలాంగులకు ట్రైమోటారు సైకిళ్లు పంపిణీ చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కుప్పంలో జీఎన్ రెడ్డి విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం హర్షణీయం అన్నారు. జీఎన్ రెడ్డి భార్య రోహిణి రెడ్డి మాట్లాడుతూ తన భర్త విగ్రహాన్ని ఆవిష్కరించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హఫీజ్, మునస్వామి, జెడ్పీటీసీ సభ్యులు శరవణ, ఎంపీపీ అశ్విని, కన్వీనర్ మురుగేష్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రికి ఘనస్వాగతం

రామకుప్పం: కుప్పం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మండలంలోని రాజుపేట రోడ్డులో ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్ సీపీ మండల నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కుప్పం: ట్రై మెటారు సైకిల్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి



పుంగనూరు: ఉరుసు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్

మంత్రి పెద్దిరెడ్డితో దర్గా కమిటీ సభ్యుల భేటీ

పుంగనూరు: రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పుంగనూరులోని నూర్‌షావలిబాబా దర్గా కమిటీ అధ్యక్షుడు కరీముల్లా తదితరులు కలిశారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న ఉరుసు పోస్టర్లను మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌తో కలసి ఆవిష్కరించారు. ముస్లింలకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఉరుసు జయప్రదం కావాలని మంత్రి పెద్దిరెడ్డి ఆకాంక్షించారు.

మినీ మార్కెట్ యార్డు త్వరితగతిన పూర్తి చేయండి

వి.కోట: శివునికుప్పం వద్ద ఏర్పాటు చేస్తున్న మినీ మార్కెట్ యార్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని శివునికుప్పం సమీపంలో నిర్మిస్తున్న మినీ మార్కెట్‌యార్డు భూమి పనులను, స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్థల వివరాలు, చేపట్టనున్న పనులను మంత్రికి వివరించారు. ఈ ఏడాది మామిడి సీజన్‌కు మార్కెట్‌ను రైతులకు అందుబాటులోని తేనున్నట్లు వారు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ నాణ్యతగా పనులు చేపట్టి, రైతుల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్, జెడ్పీ చైర్మన్ సలహాదారుడు ఎస్ గౌస్, నాయకులు జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఆంజినేయులు, షామీర్, గోపిరెడ్డి, ధవణం భక్త, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేపటి నుంచి మహామేళా



కరపత్రాలు అందజేస్తున్న మదన్‌మోహన్

రామకుప్పం: అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయ వలంటీర్ల ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి యోజనపై గురు, శుక్రవారాల్లో మహామేళా నిర్వహించనున్నట్లు పలమనేరు సబ్‌డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్ అన్నారు. రామకుప్పంలోని ఇందిరానగర్, గాండ్లవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి పుట్టిన బిడ్డ నుంచి 10 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ఆడపిల్లలు అర్హులన్నారు. అనంతరం స్థానిక తపాలా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా తపాలా కార్యాలయ పరిధిలో ప్రతి ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిపించాలని తపాలా సిబ్బందిని ఆదేశించారు. సబ్‌పోస్ట్‌మాస్టర్ దొరబాబు, శ్రీనివాసయ్య, నాగభూషణం, బీపీఎంలు మురుగేష్, వెంకటేశు, ఫైరోజ్ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

కుప్పం: ఆదానీ గ్రూపు కంపెనీలపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కుప్పం ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఇటీవల ఆదానీ గ్రూపు కంపెనీలు బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుని ఆర్థిక నేరాలు పాల్పడుతున్నాయని విమర్శించారు.

క్లుప్తంగా

స్థల పరిశీలన



జాండ్లవారిపల్లెలో స్థల పరిశీలన చేస్తున్న ప్రజా ప్రతి నిధులు

రొంపిచెర్ల: మండలంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం జాండ్లవారిపల్లె, చెంచంరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగిరెడ్డి, సుధారాణి, నాయకులు భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉరుసు



విద్యుద్దీపాలంకరణలో నూర్‌షావలి దర్గా

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై ఉన్న సయ్యద్ నూర్‌షావలిబాబా వారి ఉరుసు కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు కమిటీ అధ్యక్షుడు కరీముల్లా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 9న గంధంతో ప్రారంభమైయ్యే ఉరుసులో రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు. 11, 12 రెండు రోజులపాటు ఖవ్వాలితో ఉరుసు ముగుస్తుందన్నారు.

పోషకాహారం పంపిణీ



పలమనేరు: పీపీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం టీబీ వ్యాధితో బాధపడుతున్న రోగులకు దాతలు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన దాతలు శేగు నరసింహులుశెట్టి, రాఘువులు శెట్టి పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో టీబీ రోగులకు కందిపప్పు, గోధుమపిండి, సెనగలు, కోడిగుడ్లు, రాగిపిండి, నూనె తదితరాలను అందజేశారు. పీపీఎస్ నిర్వాహకులు ఆనందబాబు, సీతారామయ్య, నరసింహులు, మండల వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

నేడు శిక్షణ

కుప్పం: మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వలంటీర్లు, గృహసారథులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని అంబికా కల్యాణ మండపంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

భూ సర్వేపై ఆర్డీఓకు ఫిర్యాదు

పలమనేరు: తన సెటిల్‌మెంట్ భూమిని కొలిచి హద్దులు చూపాలని దరఖాస్తు చేసుకుంటే తనకు తెలియకుండానే సర్వే చేశారని బాధితురాలు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు.. గంగవరం మండలం కీలపట్ల గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్తె వినీతకు సర్వే నంబర్ 32.4సీలో 29 సెంట్ల భూమి ఉంది. దీనికి హద్దులు చూపాలని గత డిసెంబరులో చలానా కట్టారు. సాధారణంగా అయితే సరిహద్దు రైతులతో పాటు చలానా చెల్లించిన రైతుకు సైతం నోటీసులు జారీ చేసి, ఆపై సర్వే చేయాల్సి ఉంది. కానీ మండల స్థాయి అధికారులకు చలానా కట్టిన వ్యక్తి తెలియకుండా సచివాలయ సర్వేయర్ షమీర్ పక్క భూమి రైతు విశ్వనాధయ్యతో కుమ్మక్కై బాధిత రైతు వినీతకు తెలపకుండా సర్వే చేశాడని బాధితురాలు వాపోయింది. దీనిపై డివిజనల్ సర్వేయర్ ద్వారా మళ్లీ సర్వే చేయించి, తనకు హద్దులు చూపాలని, సచివాలయ సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

నాయీ బ్రాహ్మణులకు దక్కిన అరుదైన గౌరవమిది

పలమనేరు: ఆలయాల కమిటీల్లో విధిగా నాయీ బ్రాహ్మణులుండాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయడం తమకు దక్కిన అరుదైన గౌరవమని ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగేంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాటి ప్రజాసంకల్ప పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని సీఎంగా నేడు నిలబెట్టుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో తమ కులస్తులను నియమించారని తెలిపారు. అయితే అన్ని దేవాలయాల పాలక కమిటీల్లోనూ తప్పకుండా ఓ సభ్యుడిని నియమించాలని ఆదేశాలు జారీ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్యకు కృతజ్ఞతలను తెలిపారు.

ప్రజా శ్రేయస్సుకు ఎల్లవేళలా కృషి



లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు కోసం ఎల్లవేళలా కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మంగళవారం మండలంలోని ముదరదొడ్డి పంచాయతీలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

ప్రభుత్వం గత మూడన్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పేద ప్రజల పాలిట వరాలని చెప్పారు. ఒక్కొక్క ఇంటికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఇల్లు లేని వారు ఎవరూ ఉండకూడదన్న లక్ష్యంతో పేదలందరికీ సొంతిటి కల సాకారం చేసి, పేద ప్రజల గుండెల్లో జగనన్న దేవుడై నిలిచాడన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ సానుభూతి పరులు, జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికి మాత్రమే ఇళ్లు, పింఛన్లు, ప్రభుత్వ పథకాలు దక్కేవని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కుల, మతం రాజకీయాలకతీతంగా పథకాలను అందిస్తూ దేశానికే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రెడ్డి, సర్పంచ్ దామోదారం, నాయకులు రాధాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, భూపతి, సుభాష్, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



బైరెడ్డిపల్లె జగనన్న కాలనీలో నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

బైరెడ్డిపల్లె: ప్రభుత్వాధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మండలంలోని బేలుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, బైరెడ్డిపల్లె జగనన్న లేఅవుట్, కడపనత్తం సచివాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తరగతులు మార్చడం ముఖ్యం కాదని, విద్యార్థుల సామర్థ్యం పెరిగేలా విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. గణిత శాస్త్రంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి వారికి అర్థమయ్యే రీతిలో గణిత శాస్త్ర బోధన చేయడానికి ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. విద్యార్థులు సక్రమంగా యూనిఫామ్ వేసుకుని రావాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు ఆటపాటలతో ప్రాథమిక విద్యను పరిచయం చేయాలని, గుడ్లు, అరటిపండ్లు క్రమం తప్పకుండా అందజేయాలన్నారు. అనంతరం బైరెడ్డిపల్లె జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయడానికి సిద్ధం చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. జగనన్న కాలనీకి వెళ్లే రహదారికి సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. కడపనత్తం సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది పని తీరు సరిగ్గా లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధికి సంబంధించిన వివరాలు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు. వలంటీర్లు వారంలో మూడు రోజుల పాటు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఎంఈఓ సాయిలీల, హౌసింగ్ డీఈ రమేష్ ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం



మాట్లాడుతున్న సీడీపీఓ అరుణశ్రీ

కుప్పంరూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణశ్రీ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ పేట పాఠశాలలో బాలికలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ బాలికలు 21 ఏళ్లు వయస్సు వచ్చిన తరువాత వివాహం చేసుకోవాలని, ఎవరైనా తల్లిదండ్రులు ముందస్తు పెళ్లిళ్లకు చేయాలని చూస్తే చట్టరీత్యా శిక్ష పడుతుందని చెప్పారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేసుకోవడంతో బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. అంతే కాకుండా కుటుంబ వ్యవస్థపై అవగాహన లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. బాలికలు బాగా చదువుకుంటే మంచి తెలివితేటలు వస్తాయని, తద్వారా కుటుంబాన్ని చక్కపెట్టుకోగలుగుతుందన్నారు. చదువు లేకపోతే సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మహత్యలు, ఇతర ఆలోచనలు వస్తాయని చెప్పారు. చదువుకుంటే వీటన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కొవచ్చన్నారు. ఎవరైనా బాల్య వివాహాలకు యత్నిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి

రామకుప్పం : మండకేంద్రంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లను తహసీల్దార్ మురళి మంగళవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే గ్రామ సచివాలయం,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రజలకు సకాలంలో సేవలందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

మైలేరుకి అనుమతి లేదు

పలమనేరు: మండలంలో జల్లికట్టు, మైలేర్లకు అనుమతులు లేవని పలమనేరు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈనెల 10వ తేదీన మండలంలోని కొలమాసనపల్లెలో మైలేరు జరుగుతుందని గుర్తుతెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి తప్పుడు మెసేజ్‌లను జనం నమ్మవద్దని చెప్పారు. ఎవరైనా ఎద్దుల పరుగు పందేలను నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు తప్పవని హెచ్చరించారు.

11న లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు

పుంగనూరు: పట్టణంలోని న్యాయస్థానంలో ఈ నెల 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధుతో కలసి ఆయన న్యాయవాదులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ 11వ తేదీన జరిగే లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్ పరిధిలో ఉన్న కేసులను మాత్రమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్వీనర్లు, గృహసారథుల సమావేశం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో బుధవారం కల్లూరు జెడ్పీ అతిథి భవనంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ ముర్వత్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గ సమన్వయకర్త జింకా చలపతి, పెద్దిరెడ్డి, మంత్రి పీఏ మునితుకారాం హాజరవుతారన్నారు.

రొంపిచెర్లలో 8న..

రొంపిచెర్ల: స్థానిక నాగిరెడ్డి కల్యాణ మండపంలో గృహసారథులకు ఈ నెల 8వ తేదీ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వనర్ కరీముల్లా మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం పరిశీలకుడు జింకా చలపతి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, పాల్గొంటారని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రమాబాయి జయంతి



రమాబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న నేతలు

పలమనేరు: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక ఎస్సీ సంఘం నేతలు, ఎస్సీ ఉపాధ్యాయ సంఘం నేతల ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు నాగరాజు, పుష్ప రాజు, నాగయ్య, ప్రమీల పాల్గొన్నారు.

సేవాభావంతో మెలగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సేవాభావంతో మెలగాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం కుప్పం పట్టణంలోని బైపాస్ రోడ్డులో మున్సిపాలిటీ పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకం చేపట్టారని, ఆ నమ్మకాన్ని నిలుపుకునే విధంగా పని చేయాలన్నారు. మీకు కేటాయించిన గృహాలను తరచూ సందర్శిస్తూ, వారికి అందుతున్న లబ్ధి గురించి తెలుసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అందరిని కలుపుకుని మీ విధులను చేపట్టాల్సి ఉంటుందన్నారు. కుప్పం మున్సిపాలిటీ ఇన్‌చార్జి నరేష్‌కుమార్‌రెడ్డి, కుప్పం ఎన్నికల పరిశీలకుడు రెడ్డెప్ప మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేందుకు ఇప్పటి నుంచే కలిసి పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్లు మునస్వామి, హఫీజ్, రంగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేసి, రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించే దిశగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. మంగళవారం మండల కన్వీనర్ రుక్మిణమ్మ అధ్యక్షతన పార్టీ నియోజక వర్గ పరిశీలకులు జింకా వెంకటా చలపతి పర్యవేక్షణలో గృహసారథుల శిక్షణ తరగతులను అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ కలిసి కట్టుగా ఐకమత్యంగా ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా సర్వే చేయాలన్నారు. ఇతర పార్టీలకు చెందిన వారిని గుర్తించి, వైఎస్సార్‌సీపీ వైపునకు ఆకర్షితులయ్యేలా మార్పు తీసుకురావాలన్నారు.

ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు

పేదల సొంత ఇంటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆదేశించారు. గడ్డంవారిపల్లె మార్గంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన 100 కేవీ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మంత్రి పీఏ మునితుకారం, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సర్పంచ్ వరుణ్ భరత్, ఎంపీటీసీ సభ్యులు రూపారేఖ, శ్రీరాములు, సదుం కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు కీలక పాత్ర పోషించాలి



మాట్లాడుతున్న కొండవీటి నాగభూషణం, చిత్రంలో పెద్దిరెడ్డి

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన గృహసారథులు పార్టీని పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం తెలిపారు. మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ పార్టీ విధివిధానాలను ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని 50 ఇళ్లలోని ప్రజలకు తెలియజేసి, చైతన్యపరచాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పుంగనూరు ఆదర్శంగా ఉండేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. నూతనంగా నియమితులైన కన్వీనర్ వరదారెడ్డిని, నాయకులను సన్మానించారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్‌పర్సన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫక్రుద్దీన్‌షరీఫ్, ఇష్తికార్ అలీ అహమ్మద్, జయరామిరెడ్డి, ఆవుల అమరేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు



చెన్నకేశవస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతి నిధులు

రొంపిచెర్ల: చెన్నకేశవస్వామి ఆలయాభివృద్ధికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎండోమెంట్ ఏఈ ఆనంద్ తెలిపారు. మంగళవారం ఆయన పాతకురవపల్లెకు సమీపంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో మంత్రి ఎండోమెంట్ అధికారులకు ఆలయాభివృద్ధికి ప్రతి పాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆలయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ, మండల సర్వేయర్ సులోచన, నాయకులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి , పెద్ద నాగరాజ తదితరులు పాల్గొన్నారు.